క్లుప్తంగా

నూకాంబిక ఆలయానికి రూ.20 వేల విరాళం



విరాళం అందజేస్తున్న భక్తుడు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రధాన ద్వారానికి స్టీల్ గేటు నిమిత్తం శరగడం మహేశ్వరరావు, రామసీత దంపతుల కుమారుడు ప్రభాకర్ రూ.20 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఆలయ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు భద్రావతి, భావనారుషి కల్యాణం

అచ్యుతాపురం రూరల్: భద్రావతీ సమేత భావనారుషి పుష్కర కల్యాణ మహోత్సవానికి భక్తులందరూ తరలి రావాలని దుప్పితూరు చేనేత సంఘం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు కోరారు. ఈ వేడుక సోమవారం దుప్పితూరు గ్రామంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

2 నుంచి ఉచిత పాలిసెట్ శిక్షణ

అనకాపల్లి: పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక నర్సింగరావుపేటంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా విద్యార్థుల పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. 9440389409 సంప్రదించాలన్నారు.

ఉపమాక రామాలయంలో సప్తాహం



సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి: మండలంలో ఉపమాక మెరకవీధి రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకుని సప్తాహం ఏర్పాటు చేశారు. ఉత్సవాలకు శ్రీకారం చుట్టిననాటి నుంచి శ్రీరామనవమి వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బృందాలు భజన గీతాలు ఆలపిస్తున్నాయి. శ్రీరామనవమి నాడు స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ వర్గాలు తెలిపాయి.

వైభవంగా మహాలక్ష్మమ్మ జాతర



కోటవురట్లలో మహాలక్ష్మమ్మ ఆలయం

కోటవురట్ల: ఉగాది పర్వదినాన కోటవురట్ల శివారు పేటలో మహాలక్ష్మమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తుల తాకిడి నెలకొంది. ఇక్కడి ఆచారం ప్రకారం అమ్మవారికి అరటి పండ్ల గెలలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద ప్రసాద వితరణ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా ముగ్గుల పోటీ



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న మాజీ సర్పంచ్ శ్రీరామ్మూర్తి

కోటవురట్ల: కె.వెంకటాపురంలో నూకాంబిక అమ్మవారి మహోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. వేడుకలలో భాగంగా ఉగాది పర్వదినాన ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలువురు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. రంగవల్లికలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా దేవాడ రమ్యకు రూ.3,116, మాకిరెడ్డి రమాదేవికి రూ.2116, సర్వసుద్ధి దుర్గకు రూ.1116 చొప్పున గ్రామపెద్దలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి, ఉప సర్పంచ్ గొల్లు శ్రీనివాసరావు, గ్రామ పెద్ద గొల్లు చిట్టిబాబు పాల్గొన్నారు.

కొబ్బరి ధర పైపైకి..

- రైతుల్లో కనిపించని ఆనందం
- తెగుళ్ల వల్ల తగ్గిన దిగుబడులు
- నష్టాల నుంచి బయటపడలేక వేదన



పెచ్చు ఒలకుండా కాయలతోపాటు ఎగుమతులు చేస్తున్న కొబ్బరి

ఎస్.రాయవరం: కొబ్బరి ధర పెరిగినా రైతుల్లో ఆనందం కనిపించడం లేదు. ఈ ఏడాదైనా నష్టాల నుంచి బయటపడవచ్చని భావించిన వారికి నిరాశే మిగిలింది. తెగుళ్ల వల్ల దిగుబడులు తగ్గిపోవడంతో పెరిగిన ధరను చూసి ఉసూరుమంటున్నారు. మరో కోనసీమగా పేరుగాంచిన ఎస్.రాయవరం మండలంలో మండలంలో 7 వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు సాగవుతున్నాయి. మూడు నెలలుగా పెరిగిన కొబ్బరి ధర నిలకడగా ఉండటంతో రైతులు ఉన్న కాయలను విక్రయిస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు

ఈ ప్రాంత కొబ్బరికి ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉండటంతో వ్యాపారులు రైతుల తోటల వైపు పరుగులు తీస్తున్నారు. తోటల నుంచి దిగుమతి చేసిన కాయలను వెంట వెంటనే తరలించి భద్రపరచి ఎగుమతులు చేస్తున్నారు. వ్యాపారులు రైతుల వద్ద నేరుగా ఒక్కో కాయకు ఐదారు నెలల క్రితం రూ.10 నుంచి రూ.15 వరకు చెల్లించగా, తాజాగా రూ.18 నుంచి రూ.20 వరకు చెల్లిస్తున్నారు. మార్కెట్‌లో మాత్రం రూ. 30 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. మండలంలో కొబ్బరి తీతలో కాయలు నాణ్యతవి కావడంతో పొరుగు రాష్ట్రాల వ్యాపారులు ఎస్.రాయవరం మండలంలో కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటి వరకు కొబ్బరి ఒలిచి తీసుకు వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా కొబ్బరి పెచ్చులు ఒలుపు చేయకుండానే లోడింగ్ చేసి ఎగుమతులు చేస్తున్నారు. దీంతో మండలంలో కొబ్బరికి గిరాకీ బాగా పెరిగింది. పరిసర ప్రాంతాలైన యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, రాంబిల్లి మండలాల నుంచి సేకరించిన కొబ్బరి కాయలు వ్యాపారులు పొరుగు రాష్ట్రాలు ఒడిశా, ఝార్ఖండ్, తెలంగాణ వంటి ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు.

తగ్గిన దిగుబడి..

ఎకరానికి వెయ్యి నుంచి 15 వందల కాయలు తీతకు (40 రోజులు వ్యవధిలో) వచ్చేవి. ఇప్పుడు కనీసం ఐదు వందలు కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు. గడిచిన కొన్నేళ్లుగా కొబ్బరికి తెల్ల దోమ తెగులు ఆశించి ఆకులు నల్లగా మారుతున్నాయి. దీని నివారణకు క్రిమిసంహారక మందులు ఎన్ని వాడినా ఫలితం లేదని వాపోతున్నారు. తెగులు కారణంగా కొబ్బరి దిగుబడులు బాగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సహకారం లేదు



కొబ్బరికి ఆశాజనకంగా ధర ఉన్నప్పటికి దిగుబడులు బాగా తగ్గిపోయాయి. తెల్లదోమ తెగులు వల్ల కొబ్బరి తోటలు ఎండిపోతున్నాయి. ప్రారంభ దశలోనే పిందె రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీనికి తోడు కోతులు పాడు చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం ఉండటం లేదు. ధర బాగున్నా కాయలు లేనిది రైతుకు ప్రయోజనం లేదు.

– కొణతాల శ్రీనివాస్‌రావు, కొబ్బరి రైతు, ఎస్.రాయవరం

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కొబ్బరికి ధర బాగుండటంతో వ్యాపారులు నేరుగా తోటల వద్దకు వస్తున్నారు. ఎకరాకి వెయ్యి కాయలు పైగా వచ్చేవి. ఇప్పుడు రెండు వందల నుంచి మూడు వందలు మాత్రమే వస్తున్నాయి. ధర బాగున్నా రైతుకు నష్టమే మిగులుతోంది. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– కాసెపు అప్పన్న, సర్వసిద్ధి, ఎస్.రాయవరం మండలం

వేడుకగా సీతారాముల కల్యాణ రాట మహోత్సవం



రామాలయం వద్ద రాట మహోత్సవంలో భక్తులు

మునగపాక: స్థానిక పంచాయతీ వీధిలోని రామాలయం వద్ద ఆదివారం సీతారాముల వారి కల్యాణ రాట మహోత్సవం వేడుకగా నిర్వహించారు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా వేప చెట్టుకు పసుపుకుంకుమ అద్ది వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ రాట మహోత్సవాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు నినదించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, ఆడారి లక్ష్మణరావు, మళ్ల జోగారావు, ఆడారి కాశీబాబు, అలంక ప్రకాశరావు, టెక్కలి రమణబాబు, జల్లేపల్లి కిష్టప్ప, వెలగా రామకృష్ణ, ఆడారి సూరిబాబు, పొలిమేర కృష్ణ, సూరిశెట్టి శ్రీనివాస్, కుంది సూర్యనారాయణ, బొడ్డేడ రామారావు, బూడిద శ్రీనివాసరావు, పూసర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ

మునగపాక: ప్రతి ఒక్కరూ కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ కోరారు. రూ.5 కోట్లతో మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి పలువురు భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. మళ్ల భాస్కరనాయుడు, మొల్లేటి బాపూజీ నాయుడు ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. షేక్ ఆంజనేయులు, నాంచారి బీబీ దంపతులు రూ.50,052, మళ్ల వేణుబాబు రూ.5,116 వంతున విరాళాలు అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో మళ్ల పొలిమేర కృష్ణ, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి కృష్ణ, ఆడారి లక్ష్మణరావు, అలంక ప్రకాశరావు, బొడ్డేడ రామారావు, వెలగా రామకృష్ణ, ఆడారి కాశీబాబు, మళ్ల జోగారావు, కిష్టప్ప, వీడీఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శారదాపీఠంలో ఉగాది వేడుకలు



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో విశ్వావసు నామ సంవత్సర తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా పీఠంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. స్వామీజీ చేతుల మీదుగా భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. పంచాంగ శ్రవణంలో రాశి ఫలాల గురించి పండితులు వివరించారు. విశ్వావసు సంవత్సరం అంతా ప్రజలకు విశేష ఫలితాలు అందించాలని ఆకాంక్షించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఉగాది ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలతో కిక్కిరిసిన కల్యాణ మండపం



క్యూ కాంప్లెక్స్‌లో స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సింహాచలం: ఉగాదిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ఈ సేవల్లో పాల్గొన్నారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రాలను అందించారు.

సింహగిరికి ఉగాది శోభ

సింహగిరి ఆదివారం ఉగాది శోభని సంతరించుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొండపైకి భక్తులు పోటెత్తారు. యువత సాంప్రదాయ వస్త్రధారణలో కనువిందు చేశారు. ప్రసాద విక్రయశాల, అన్నప్రసాదశాల వద్ద భక్తులు బారులు తీరారు. రాజగోపురం ఎదురుగా ఉన్న మాడవీధిలో ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. ఉగాది సందర్భంగా ఉదయం ఆలయంలో స్వామికి విశేష అర్చన, ఉగాది పచ్చడి నివేదన జరిపారు.

పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానం



రత్నకుమారిని శాలువాతో సత్కరిస్తున్న జానకీ రామరాజు, మలసాల కుమార్‌రాజా

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడి పనిచేసిన వ్యక్తులకు పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం ఇస్తున్నారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకుడు మలసాల కుమార్‌రాజా తెలిపారు. మండలంలో గుండాల జంక్షన్ వద్ద నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన అంట్యాకుల రత్నకుమారిని శనివారం వారు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి కిరీటాల బహూకరణ



ఆలయ కమిటీ సభ్యులకు కిరీటాలు అందిస్తున్న దాతలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని శ్రీదేవి, భూదేవి, అమ్మవార్ల అలంకరణ కోసం గ్రామానికి చెందిన జలమూరు రామమోహన్‌రావు, వరలక్ష్మి దంపతులు, వారి అల్లుడు తిమ్మాపాత్రుని శ్రీనివాసరావు, ప్రమీలాదేవి(ఆస్ట్రేలియా) కిరీటాలు బహూకరించారు. ఈ మేరకు దాతలు వాటిని ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పూడ్చిన నాలుగు మాసాలకే గుంతలు



గోతులతో నిండిన పరవాడ-వాడచీపురుపల్లి రహదారి



ఊటగెడ్డ మలుపులో ప్రయాణికులను భయపెడుతున్న గుంత

పరవాడ: గుంతలతో నిండిన వాడచీపురుపల్లి–పరవాడ రహదారితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రహదారిలో పడిన గుంతలను నాలుగు నెలల క్రితం పూడ్చారు. నెలలు తిరక్క ముందే రోడ్డులో యథావిధిగా ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ముత్యాలమ్మపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం తదితర గ్రామాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు, వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. రోడ్డులో పలు చోట్ల పడిన గుంతలతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదే రహదారిలో రాకపోకలు సాగిస్తున్న బూడిద, బొగ్గు లారీల కారణంగా రోడ్డు మరింత అధ్వానంగా మారింది. ఊటగెడ్డ కూడలి మలుపులో తరచూ ఏర్పడుతున్న గుంతను పూడ్చేందుకు శాశ్వత చర్యలు చేపట్టట్లేదు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణికుల ఇబ్బందుల్ని గుర్తించి రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా తెలుగు సంవత్సరాది



పి.ధర్మవరంలో ఉత్తమ రైతులను సత్కరిస్తున్న గ్రామపెద్దలు



మునగపాకలోని వినాయకున్ని దర్శించుకుంటున్న భక్తులు



కోటవురట్ల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

కోటవురట్ల: మామిడాకుల తోరణాలు.. మంగళవాయిద్యాలు, కోకిలమ్మ రాగాలు, షడ్రుచులతో చేసిన ఉగాది పచ్చడి రుచులు ఆస్వాదిస్తూ కొత్త తెలుగు సంవత్సరాది యుగాదికి ఘనంగా స్వాగతం పలికారు. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ఆలయాలలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరంలో రాశి ఫలాల ప్రభావాన్ని వివరించారు. కైలాసపట్నంలోని రాజగోపాలస్వామి ఆలయం, కోటవురట్లలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, చినలింగాపురంలోని దుర్గామల్లేశ్వర అయ్యప్ప ఆలయాలలో భక్తుల తాకిడి నెలకొంది. ఆలయాల వద్ద ఉగాది పచ్చడి వితరణ చేశారు.

నక్కపల్లి: చినదొడ్డిగల్లు శ్రీరామ పంచాయతన ఆలయంలో ధర్మకర్త, విశ్రాంత ఉపాధ్యాయుడు, రాష్ట్రపతి అవార్డుగ్రహీత శ్రీపాద సత్యదేవ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు విశ్వావసు నామ సంవత్సరంలో తమ జన్మనక్షత్ర, రాశులకు సంబంధించిన మంచి చెడులను గురించి తెలుసుకున్నారు. శుభాశుభాలను గురించి వివరించడంతో పాటు జాతకపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థాన అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని నామవరంలో వెలసిన స్వయంభూ రామలింగేశ్వర స్వామి ఆలయం, పాయకరావుపేట పట్టణంలో రాధారుక్మిణి సమేత పాండురంగ స్వామివారి దేవస్థానాలకు భక్తులు తరలివచ్చారు. ఇక్కడా పంచాంగ శ్రవణం కార్యక్రమాలు జరిగాయి. ఆలయాల్లో ఉగాది పచ్చడి పంచిపెట్టారు.

మునగపాక: మండల వ్యాప్తంగా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సరంలో భాగంగా పలు దేవాలయాలు ఆదివారం భక్తులతో కళకళలాడాయి. ఉగాది పచ్చళ్లను తయారు చేసి ప్రతి ఒక్కరికీ పంచుకుంటూ సందడి చేశారు. మునగపాకలోని పురాతన వినాయక ఆలయంలో భక్తులు అభిషేకాలు, పూజలు చేశారు. సాంబశివుని, నూకాంబిక, లింగరాయి గుడి తదితర దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు. నూతన వస్త్రాలు ధరించడంతో పాటు పసుపు కొమ్ములను కొనుగోలు చేసి మరీ ఉగాది వేడుకలను పండుగలా జరుపుకున్నారు.

ఎస్.రాయవరం: ఉగాది పర్వదినాన్న పురస్కరించుకుని ఆదివారం పలు గ్రామాల్లో పంచాగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దార్లపూడి, కొరుప్రోలు, ఎస్.రాయవరం, పి.ధర్మవరం తదితర గ్రామాల్లో రామాలయాలు, వేంకటేశ్వరస్వామి, దుర్గమ్మ ఆలయాలు వద్ద పురోహితులు పంచాంగం శ్రవణం చెప్పారు.

పి.ధర్మవరంలో రైతులకు సన్మానం..

ఉగాది పురస్కరించుకుని పి.ధర్మవరంలో గ్రామ పెద్దలు సమక్షంలో ఉత్తమ రైతులను ఘనంగా సత్కరించారు. గ్రామంలో ఈ ఏడాది అత్యధికంగా సాగు చేసి అధిక దిగుబడులు సాధించినందుకు రైతులను దుశ్శాలువాతో సన్మానించారు.

మునగపాక పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ

మునగపాక: స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆదివారం పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూపం సందర్శించారు. సాధారణ విజిట్‌లో భాగంగా ఆయన స్టేషన్‌లోని పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త అమావాస్య పండుగలో భాగంగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని ఎస్ఐ ప్రసాదరావును ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకుండా శాంతియుత వాతావరణంలో పండుగలు జరిగేలా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని సూచించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

మాకవరపాలెం: మండల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. మండలంలోని ఎన్‌జీఆర్‌పీ అగ్రహారంలో ఆదివారం మండల ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్) పేరుతో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు.

అప్పన్న చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ విక్రమ్‌కు విరాళం అందిస్తున్న దాత లక్ష్మీనారాయణరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం నగరంలోని ఇసుకతోట ప్రాంతానికి చెందిన లక్ష్మీనారాయణరావు దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళం అందించారు. సింహగిరి పైనున్న పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ విక్రమ్‌కు సంబంధిత విరాళాన్ని నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రంలను అధికారులు అందించారు.

నర్సీపట్నంలో టీ20 టోర్నీ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సిహెచ్.విజయ్

నర్సీపట్నం: ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల మైదానంలో నర్సీపట్నం ప్రీమియం లీగ్ సీజన్-1 టీ20 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ప్రారంభమైంది. ఈ పోటీలను టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.66,666లు, రెండో బహుమతిగా రూ.33,333గా నిర్ణయించామని నిర్వాహకులు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో ఎంఏయూడీ ప్రధాన కార్యదర్శి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సురేష్‌కుమార్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(ఎంఏయూడీ) ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనమిచ్చి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, చిత్రపటం శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో అందించారు.